ముందీ? "క్యాష్‌తో పనున్న పోస్టులోకి ట్రాన్సఫరు చేశారు నాన్నా! అంచేత ఓ వెయ్యిరూపాయలు డిపాజిటు కట్టాలిట. నాదగ్గరో అయిదువందలున్నాయి. మిగతాది నువ్వు తప్పనిసరిగా సర్దాలి నాన్నా...నెమ్మదిమీద పంపిచేస్తాను" అన్నాడు ముఖం వేలవేసి. విశ్వనాథం ఆశ్చర్యంగా తనను తాను చూసుకుని పక్కన నవ్వేశాడు... ఇంకా మరోవిషయం చెప్పాడు కొడుకు. "ఏదోజాతీయ ప్రణాళికల ఋణం అంటూ కంపల్సరీగా ఓ రెండు వందలేనా కట్టాలిట. రూల్సు వచ్చాయి ఆఫీసులకి,మీకింకా రాలే?"అని...ఇంకేం భేషుగ్గావుంది. "అలాగే పట్టుకెళ్లు, పంపించడంమాట తర్వాత" అని మాత్రం అనగలిగేడు విశ్వనాథం అదెలాగూ అసంభవమని ఎరుగును కనుక.

కొడుకు వెళ్ళిపోయాక భార్యదగ్గరన్నాడు ముద్దుగా—"చంద్రహారాలు చేయించమంటావే పెళ్ళామా?"అని..."అదేంకర్మం ఒళ్ళంతా బంగారంతో మలామా చేయించండి. ఒద్దన్నానుకనకనా" అంది భార్య...

ఇద్దరూ నవ్వుకున్నారు. ఈ సామాన్యుని సారథ్యంలో రోడ్డు అద్భుతమైన గతుకుల రోడ్డు. వాటినీ నవ్వుతో పూడ్చుకుంటూ పోతేనే ప్రయాణం తేలిక. ఏడ్చేదానికి కూడా నవ్వుకు పోడంలోనే ఈ జీవితపు మాధుర్యం!

---

స్కెచ్

# ఎదురుతిరిగిన చిలక

మధిర భానుమూర్తి

అవధాని చిన్నప్పటినుంచీ ప్రపంచాన్ని శ్రద్ధగా పరిశీలించాడు. మనుష్యుల ప్రవృత్తులను బాగా అర్థం చేసుకున్నాడు. అన్నిరకాల మనుష్యుల్నీ బాగా పరిశీలించి వారు అలా తయారవటానికి కారణాలు బాగా అవగాహన చేసుకున్నాడు. చదువుకున్నవాడు. చాలా విషయాలుగ్రహించినవాడు అయిన కారణంగా అతనికి కొన్ని అభిప్రాయాలు ఏర్పడ్డాయి.

ఉత్తమ ఆదర్శాలులేనివాడు అసలు మనిషే కాదని అతని అభిప్రాయం. ఆదర్శాలే మనిషిని వృద్ధిలోకి తీసుకువచ్చేవి. ఆ ఆదర్శాల సాధనలోనే ఆనందంఉంది. కనక ప్రతివాడికీ ఆదర్శాలు అవసరం అంటాడు. తను జీవితకాలంలో ఎన్నో విషయాలను సాధించాలని నిశ్చయించుకున్నాడు. వాటిల్లో పిల్లల పెంపకం ఒకటి. దీన్నిగురించి తీవ్రంగా ఆలోచించేవాడు. పిల్లలు బాగుపడ్డా, చెడిపోయినా పెద్దలవల్లనే నంటాడు. చిన్నప్పుడే వాళ్ళని అదుపులోపెట్టకపోతే పెద్దయాక వాళ్ళసలు లొంగరని అతని నమ్మకం. బాల్యంలో వారికి ఏయే విషయాల్లో అభిరుచి కల్పిస్తే పెద్దవారయాక వాటిల్లో ఉత్తీర్ణులవుతారు. ఆ బాధ్యత చాలవరకు తల్లిదండ్రుల మీదనే ఉందంటాడు. తన మేనల్లుడు కొంచెం అల్లరి చిల్లరగా తిరగటానికి కారణం. తనచెల్లెలు బావమరిది వాడికి యివ్వకూడనంత స్వేచ్ఛ యివ్వటమేనంటాడు. అలాగే స్వేచ్ఛ ఎక్కువై పాడయిపోయిన వాళ్ళనెందరినో గురించి చెప్పగలడు అవకాశం దొరికితే. ఇంతటి అనుభవం ఉంచుకుని తను ఆ నిర్ణయానికి వచ్చాడు. తనపిల్లల్ని ఎల్లా పెంచాలో ముందే బాగా ఆలోచించి పథకం ఒకటి తయారు చేశాడు.

అతనికి ఒక కొడుకు. పేరు రంగనాథం. ఆ కొడుక్కి అందరిలాగా గారం అలవాటుచెయ్యటం అతనికి సుతలామూ గిట్టదు. అందుకని అవసరమైనప్పుడల్లా—అంటే ఆ పిల్లాడు ఫలానా వస్తువు కావాలని మారాంచేసినప్పుడల్లా—వాడికి నాలుగు తగలనిచ్చేవాడు. తను ఒక పద్ధతిప్రకారం వాణ్ణి వృద్ధిలోకి తీసుకురావాలని చూస్తుంటే వాడే ఆ కృషికి ప్రతిబంధకమవటం అతను సహించలేకపోయేవాడు. అంత చిన్నకుర్రవాడిని పట్టుకుని అలా కొట్టడం ధర్మంకాదని ఆ తల్లి బెదురుతూనే చెప్పింది. అతనికి మాత్రం అది నచ్చ

లేదు. "మంచేదో, చెడేదో తెలియని మీలాంటి వాళ్ళుండబట్టే ఇంతమంది పిల్లలు పాడయి పోతున్నారు." అనేవాడు ఆమెతో. పిల్లల్ని గారంచేసి చూసిందల్లా కావాలనటం వారికి నేర్పగూడదని మందలించాడు.

క్రమంగా కుర్రవాడి పెంపకం తను తీసుకున్నాడు. తనే ఆ భారం వహించి ఆదర్శప్రాయంగా కుర్రాణ్ణి తయారు చెయ్యాలని నిశ్చయించాడు. ఇక ఆ రోజున అతనికి కలిగిన సంతృప్తి ఇంతా అంతా కాదు. ఆ సంతృప్తికి అవధులులేవు. ఇంక తన కుర్రాడిని పాడుచెయ్యాటము ఎవరివల్లాకాదు. తనే సర్వకాల సర్వావస్థల యందూ వాడికి కావలసినవన్నీ చూస్తాడు. వాడిని అస్తమానం తనతోనే ఉంచుకుంటాడు. చెడు సావాసాలు చెయ్యనివ్వడు. అడ్డమైన వాళ్ళతో మాట్లాడనివ్వడు. ఇంట్లోపనులు తన అజమాయిషీ క్రింద కుర్రాడిచేత చేయిస్తాడు. బజారునుంచి ఏవయినా లేవలసివస్తే తనుకూడా వాడితో వెళ్ళి మంచీ చెడ్డా చెప్తాడు వాడికి. వాడు తన కనుసన్నలలోనే నిత్యం మెలుగుతుంటే తననుకున్నట్టుగానే తయారవుతాడు. అంతేకాని ఒంటరిగా వాణ్ణివదిలేస్తే (ఒక్కమాటైనాసరే) వాడు పూర్తిగా పాడవటానికి సావకాశం ఉందని అతని నమ్మకం. కిట్టని వాళ్ళనేకులుంటారు. వాళ్ళు వీణ్ణి తప్పకుండా పాడుచేస్తారు. వాళ్ళే ఏమిటి?.కొందరు ఇదేపనిగా పెట్టుకున్న వాళ్లుంటారు. వాళ్ళకి ఇదే పని. 'తగలేసేందుకు ఎవరు దొరుకుతారా?' అని చూస్తూ ఉంటారు వాళ్ళకంట బడనివ్వ...... కూడదు కుర్రాణ్ణి. ఒక్కసారి వాళ్ళు వీణ్ణిచూస్తే పాడుచేశారన్న మాటే! ఏమీ సందేహంలేదు. వాళ్ళంతా తమకున్న వ్యసనాలు ఇతరులకు పట్టించడంలో ప్రవీణులు. అసలు వాళ్ళకి ఇంకొక పనంటూ ఉంటేగా? అందుకే తన కొడుకుని తన తోనే తిప్పుకోవటం. ఈ వయస్సులో వాడికి ఎవరేనా చెడ్డ అలవాట్లు, అభిప్రాయాలు పట్టిస్తే అవేవాడి మనస్సుకి పట్టుకుపోయి ఎంత వదుల్చుకుందామన్నా వదలవు. అందుకని ఈ బాధ్యత తనది. తనకు తప్పదు. తల్లి బొత్తిగా అజాగ్రత్త మనిషి. పిల్లాడు ఎలా తిరుగుతున్నాడో, ఎవరితో స్నేహం చేస్తున్నాడో, ఏం చదువుతున్నాడో, ఇలాంటివేమీ పట్టించుకోదు...అదీ ఓ విధంగా మంచిదే...బొత్తిగా అడివిమనిషి, ఏమీ తెలియదు. తనకే విచక్షణ జ్ఞానం లేనిది ఇంక పిల్లాడికేం నేర్పగలదు? ఇలా ఆలోచించేవాడు అవధాని. ఆ ఆలోచనలో కుర్రాడికి ఎందులో అభిరుచి ఉందనే విషయం తెలుసుకోవాలనైనా అతనికి తోచలేదు ఎన్నడూ. తను చెయ్యవద్దన్న పనులు చెయ్యకూడదు. తను వెళ్ళమంటేనే వాడు సినిమాకి వెళ్ళాలి. తను చదవమన్నప్పుడు చదవాలి. వాడికి చదవాలని ఉందా, లేదా అన్న ప్రశ్న రాలేదతనికి. తను వెళ్ళ వెళ్ళమంటేనే ఆడుకుందుకు వెళ్ళాలి.

రోజూ తెల్లవారగట్ల లేపేవాడు. ఎంతో అయిష్టంగానే లేచేవాడు రంగనాథం. లేచి పుస్తకం దగ్గర కూచుని ఏదో ఒకటి గొణిగితేనే గాని అవధాని ఊరుకునేవాడు కాదు. సూర్యోదయమయేసరికి కాలకృత్యాలు పూర్తిచేసుకుని మళ్ళీ పుస్తకం దగ్గర కూచుని వేళకి బళ్లోకి వెళ్ళాలి. బడివదలిన వెంటనే ఇంటికివచ్చి తండ్రికి కనిపించాలి. అప్పుడు తండ్రి అనుమతిస్తేనే ఆడుకోటానికి వెళ్ళటం. లేకపోతే చదువుకోవాలి. అలాగ నియమబద్ధమైన జీవితాన్ని ఏర్పాటు చేశాడు. ఆ అబ్బాయి వాటన్నిటికి కట్టుబడి కాలక్షేపం చెయ్యాలి. ఆ ఊళ్లో చదువుతునంత కాలం అలాగే ప్రవర్తించాడు. కొడుకుని చూసి అవధాని మురిసిపోయేవాడు—తను ఆశించిన విధంగా తయారవుతున్నందుకు.

ఆ ఊరిలో చదువుపూర్తయింది రంగనాథానికి. పైకి చదివించాలని అవధాని కోరిక. అయితే పై చదువుకి పొరుగూరు పంపాలి. పొరుగూరు ఒక్కణ్ణే పంపడం అంత యిష్టంలేదతనికి. అలాగని కుటుంబంతో సహా పొరుగూరుతో మకాంపెట్టడం సాధ్యంకానిపని. కుర్రాడికి చదువు చెప్పించాలంటే ఒక్కణ్ణే పంపక తప్పలేదతనికి. ఎలాగో ఒకలాగు మనస్సును సమాధాన పరుచుకోవలసి వచ్చింది. ఇన్నాళ్ళుగా తను కుర్రాడికి ఎంతో చక్కటిశిక్షణ అలవాటు చేశాడు. ఇంక వాడు పాడవడు. ఇక్కడ విచ్చలవిడిగా తిరిగివాడయితే అక్కడ కూడా పేట్రేగి ఒళ్ళూ పై తెలియకుండా సంచ

రిస్తాడు. అంతేకాని తనకొడుకేం? వాడు మిగిలినవాళ్ళకి మల్లే తయారవడు. తను వాడికి అంత మంచి అలవాట్లు చేశాడు. ఇలా సమాధాన పరుచుకుని కుర్రాడిని పంపాడు కాలేజీకి. ఒంటరిగా. అక్కడికి తన ఆదుర్దాకొద్దీ జాగ్రత్తగా ఉండమని చెప్పాడు. "నాయనా! చూడు అక్కడఅనేకరకాలజనం ఉంటారు.అక్కడి కొచ్చేసరికి ఒళ్ళూపై తెలియదు వాళ్ళకి. ఆకతాయిగా తిరుగుతారు. చదువూ సంధ్యా పట్టించుకోరు. వాళ్ళ సావాసం చెయ్యకు సుమా!...మనం అక్కడికి వెళ్ళినది చదువుకునేందుకని మరిచిపోకూడదు. జాగ్రత్తగా చదువుకో. చదువుకుని ప్రథమశ్రేణిలో రావాలి. అంతేగాని వెధవ సినిమాలు, గొడవల్లో పడకూడదు..." అని పదేపదే చెప్పాడు. చివరకు రైలు బయలుదేరేటప్పుడు కూడా మరోమాటు హెచ్చరించాడు. "ఆకతాయి మేళంతో స్నేహం చెయ్యకు... నేను చెప్పినవి మరిచిపోకు" అని.

మనిషంటే ఇక్కడున్నాడు కాని రంగనాథం ఊరివదిలి వెళ్ళినప్పటినుంచి మనసంతా వాడిమీదే ఉంది అవధానికి. మనస్సు పరిపరివిధాలపోతుంది, అంతలో సమాధాన పరుచుకుంటాడు తన కొడుకు అలాంటివాడు కాదని.

రంగనాథం కాలేజీలోచేరిన మొదట్లో తండ్రి చెప్పినమాటలు చెవులో మారుమ్రోగుతూ ఆ పద్ధతుల్లోనే నడుచుకునేవాడు. తోటివాళ్ళతో కలవలేకపోయాడు. కాని అతను ఒక్కడే. మిగిలిన వాళ్ళ ప్రవర్తన వేరుగా ఉంది. క్రమేణా తండ్రి మాటలు దూరమయ్యాయి. మిత్రుల హితబోధలు బాగా పని చేశాయి. డబ్బు మంచినీళ్ళప్రాయంగా ఖర్చుపెట్టాడు. ఇంకా డబ్బు పంపమని తండ్రికి తరుచు వ్రాసేవాడు. తండ్రి తనకు కావలసినంత డబ్బు పంపకపోతే ఆ ఊళ్లో ఖాతాలు తెరిచాడు. అప్పులు విపరీతంగా పెరిగాయి. ఇంత మార్పు రావటానికి రెండు నెలలుకూడా పట్టలేదు. ఈ విషయం విని అవధాని నిశ్చేష్టుడయ్యాడు. తను ఇన్నేళ్లుచేసిన కృషి బూడిదపోసిన పన్నీరయిందని విచారించాడు. ఆ ఊరు పరుగెత్తాడు. అక్కడ తన కుర్రాడిని చూశాడు...వీడు తన రంగనాథమేనా? కొడుకేనా?...కాదు...వెనుకటి రంగనాథం కాదు. తనుక తను ఎన్ని దెబ్బలు కొట్టినా నోరు మెదపని రంగనాథం ఇవాళ "ఏమిట్రా! ఇలా తయారయావ్?" అని అడిగేసరికే ఎదిరించి సమాధానం చెప్పాడు. "ఆ ప్రశ్నవేసే హక్కు నీకు లేదు" అని. దాంతో గుండె ఆగినంతపని జరిగింది అవధానికి.

అని ఈ కథ చెప్పి "దీనికంతకీ కారణం అవధానేనని నా అభిప్రాయం. వాడు ఆ ఊళ్ళో ఉన్నంతకాలం వాణ్ణి పంజరంలో పెట్టి బంధించాడు. వాణ్ణి ఒక్కక్షణం స్వేచ్ఛగా తిరగనివ్వేదు. అదే క్రమశిక్షణ అనుకున్నాడు. అలా ఎన్నేళ్ళో గడిపినమీదట ఒక్కసారిగా స్వేచ్ఛ వస్తే దాన్ని ఎలా వాడుకోవాలో తెలియక తికమకపడ్డాడు రంగనాథం. ఇన్నాళ్ళుగా వాడి అభిప్రాయాలకు ఏవిధమైన ఖాతరులేకుండా ఒక్కమ్మడిగా విహరించాడు. ఇంటిదగ్గర ఏమాత్రమైనా స్వేచ్ఛ వాడికి ఇచ్చివుంటే వాడు అంతగా పాడపడు "అన్నారు మేష్టారు.

"మీరు చెప్పినది సబబుగానే ఉంది. కాని ఏ జీవితానికైనా కొన్ని నియమాలంటూ ఉండాలి. ఏ నియమమూ లేకుండా గాలివెంబడిపోయే జీవితాలు ఏమంత అభిలషణీయమంటారా?...నియమాలు లేక జీవితాలు పాడయినవాళ్ళ నెందరిని మనం చూడటంలేదు."అని ప్రశ్నించాడు విద్యార్థి.

"నువ్వు చెప్పినదీ నిజమే! ప్రతిజీవితానికి నియమాలు కావాలి. అవి ఎవరికివారే ఏర్పరుచుకుంటే వాటిని పాటించటం తేలిక. ఇక్కడ అవధాని రంగనాథాన్ని ఒక పక్షిలా బంధించి పంజరంలో పెట్టాడు. రంగనాథమే తనంతట తనొక గూడు కట్టుకుకేందుకు తోడ్పడవలసింది అవధాని. అతనది గుర్తించలేదు. ఇది కత్తిమీద సాములాంటిది. చాలా జాగ్రత్తగా ఉండాలి"అన్నారు మేష్టారు.

---

వందమంది సాధారణులుచేసే పనిని ఒక్కయంత్రం చేయగలదేమోగాని,ఒక్క అసాధారణుడు చెయ్యగలిగే పని కోటి యంత్రాలైనా చెయ్యలేవు. –ఎల్బర్ట్ హబర్డ్.